క్లుప్తంగా

ఆత్మీయ సన్మానం



బ్యాంక్ మేనేజర్ తులసీరామ్‌ను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

ఎటపాక: ఖాతాదారులకు సత్వర సేవలు అందించిన నెల్లిపాక ఏపీజీవీబీ మేనేజర్ తులసీరాం సేవలు ప్రశంసనీయమని వెలుగు ఏపీఎం స్వామి అన్నారు. బదిలీపై వెలుతున్న బ్యాంకు మేనేజరుని వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు, రైతులకు అన్ని విధాలుగా బ్యాంక్ సేవలు అందించారని కొనియాడారు. తిరుమలరెడ్డి, సురేష్, నరసింహారావు, సీసీలు నారాయణ, కృష్ణవేణి, సిబ్బంది పోశమ్మ, చంద్ర తదితరులున్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



పాతరామవరం పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలోని వివిధ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాతరామవరం, నెల్లిపూడి, ఎంపీపీ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల నమోదు ప్రక్రియలపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు



తంటికొండలో సికెల్‌సెల్ అనీమియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలి డాక్టర్ వైద్య శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు డాక్టర్ సుష్మ తెలిపారు. అదే విధంగా సికెల్‌సెల్ అనీమియా, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. 40 సంవత్సరాలు నిండిన పలువురికి క్షయవ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మణ్, హెచ్‌వీ రమాబాయి, ఏఎన్ఎం సన్యాసమ్మ, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవో-3 పునరుద్ధరణకు వినతి



సర్పంచ్ పాండురంగస్వామికి వినతిపత్రం అందజేస్తున్న పీసా కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు: జీఒ నంబర్-3ను పునరుద్ధరణ చేయాలని దారెల పీసా కమిటీ సభ్యులు దేవేంద్రుడు, ఆనందరావులు కోరారు. సర్పంచ్ పి.పాండురంగస్వామిని శుక్రవారం పీసా కమిటీ సభ్యులు కలిసి జీఒ నెంబర్ 3 అమలు కోసం గ్రామ సభను నిర్వహించాలని, పంచాయతీ నుంచి తీర్మాణం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన సర్పంచ్ పాండురంగస్వామి గ్రామసభను నిర్వహించుకుందామని తెలిపారు. ఈ సందర్భంగా దారెల పీసా కమిటీ సభ్యులు దేవేంద్రుడు, ఆనందరావులు మాట్లాడుతూ జీఒ నెంబర్ 3ను అమలు చేస్తే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. కొత్త ప్రభుత్వం రివ్యు పిటిషన్ దాఖాలు చేసి జీవో-3ను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



కొయ్యూరులో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో యోగ చేస్తున్న విద్యార్థినులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా యోగా దినోత్సవం
- యోగాసనాలు, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. పలుచోట్ల పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా యోగ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఒత్తిడిని దూరం చేసి మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచి యోగా, ధ్యానం అలవర్చుకోవడం వల్ల మానసిక , శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. యోగా, ధ్యానంలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. యోగ, ధ్యానంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు.

అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మహిళా కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో అనిత కుమారి, ట్రైనర్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్స్‌పాల్స్ చలపతి, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్(హుకుంపేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి అబ్బాయి, ఎన్ఎస్ఎస్ పీవోలు రమేష్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వరప్రసాద్, లలిత, హెచ్ఎంలు ప్రభుదాస్, నానిబాబు, పీడీ పోతురాజు, ట్రైనర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యోగ దినోత్సవంలో ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీవో డి.రవికుమార్, పీడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

మోతుగూడెం: మోతుగూడెంలో జరిగిన కార్యక్రమంలో డొంకరాయి బి/42 సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆఫీసర్ సంతోష్ కుమార్ సింగ్ , డొంకరాయి ఎస్ఐ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి-42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్లు కె.ఎస్.ఎస్.సుబ్రామణి, ఎస్.పట్టాభి, హెచ్ఎం ఝాన్సీ రాణి, పీఈటీ మంగయమ్మ పాల్గొన్నారు.

గంగవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు దొర, బీజేవైఎం అధ్యక్షులు రమేష్ దొర, పీడీ శివ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



అరకులోయలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పాడేరు ప్రభుత్వ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



అడ్డతీగలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గంగవరం ఎంపీపీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



డొంకరాయిలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు, విద్యార్థులు



వై.రామవరంలో యోగా చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసులు



రాజవొమ్మంగిలో యోగా చేస్తున్న విద్యార్థినులు



కొయ్యూరులో విద్యార్థుల మానవహారం



రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

విత్తనాల పంపిణీ



జడేరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి తదితరులు



మంపలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

గంగవరం: మండలంలోని జడేరు, కొత్తాడ, మోహనాపురం రైతు భరోసా కేంద్రాల పరిధిలో జడేరు, మోహనాపురం, దొరమామిడి గ్రామాల్లో వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ మాట్లాడుతూ రైతులకు వరి విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. జడేరు ఆర్‌బీకేలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కనిగిరి రాంబాబు, ఎండపల్లి సర్పంచ్ రామలక్ష్మి విత్తనాలు పంపిణీ చేశారు. మోహనాపురంలో సర్పంచ్ కురసం అక్కమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, దొరమామిడిలో ఎంపీటీసీ పండా ఆదినారాయణదొర, సర్పంచ్ చంద్రకళ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ కో-ఆప్షన్ సభ్యులు పాము అర్జున, కొమ్మన చిన్నారావు తదితరులు వరి విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకులు గ్రేస్, సుల్తాన్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని మంప గ్రామంలో రైతులకు విత్తనాలను ఎంపీపీ బడుగు రమేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

ముగిసిన వైకుంఠ నారాయణ కల్యాణోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట : చిట్టూరి మెట్రోలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వైకుంఠ నారాయణ సమేత వర మహాలక్ష్మి అమ్మవారి ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయి. ఆఖరు రోజున సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్వక్సేన పూజ, ద్వాదశ తిరువారాధన పవళింపు సేవ, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలతో మంగళ వాయిద్యాల నడుమ ద్వితీయ వార్షిక కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి



గోమంగిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో స్వర్ణలత



కె.యర్రగొండ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

పెదబయలు: మండలంలోని గోమంగి మినీ గురుకుల పాఠశాలను మండల ఏటీడబ్ల్యూవో కె.స్వర్ణలత ఆకస్మికంగా శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలుచేయలేనట్టు గుర్తించారు. మెనూ తప్పనిసరిగా అమలుచేయాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఉపాధ్యాయులకు హెచ్చరించారు. సీకరి పంచాయతీ పన్నెడ జీపీఎస్ పాఠశాలలో ఈ ఏడాది ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో 18 మందికిగాను 17 మంది గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలల్లో అర్హత సాధించారని, అంకిత భావంతో పనిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. గిన్నెలకోట పంచాయతీ ఇనుపతీగలు జీపీఎస్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. బొంగరం పంచాయతీ వంచుర్బ పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలను అందించాలని సూచించారు.

వై.రామవరం: మధ్యాహ్న భోజన పథకంలో ప్రతీ పాఠశాలలోను మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈవో కె.తాతబ్బాయిదొర అన్నారు. మండలంలోని కె.యర్రగొండ ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరీక్షించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఆహారాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు ఇవ్వాలని, మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

నీటి సమతుల్యతతో పైరుకు మేలు

- సాగునీటి వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు



వరి పైరు



ఎగువశోభలో పొలాలు

అనంతగిరి: మన్యంలోని ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో సాగునీటి వినియోగం సమతౌల్యంలో ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు నీరు ఎక్కువైనా, ఎద్దడి తలెత్తినా దిగుబడిపైనా, భూసారంపై ప్రభావం చూపుతుందంటున్నారు. నీరు, భూమికి ఉండే సహజ లక్షణాలను గుర్తించి ఏ భూమిలో ఏ నీటితో ఏ రకమైన పంటలను పండించాలననే అవగాహన రైతులకు ఉండాలని సూచిస్తున్నారు.

నీటి వినియోగం ఇలా

ఎకరా వరి పంటకు 1,250 మిల్లీ లీటర్ల నీరు అవసరం ఉంటుందని అంచనా. పై భాగాన ఉండే రైతులకు అవగాహన లోపంతో ఎక్కువ నీటిని వినియోగిస్తారు. దీని వల్ల 20శాతం పల్లపు ప్రాంత రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. సాగు దశలో సకాలంలోని నీరు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. పైరుకు తడి 75 శాతం వరకు తగ్గిపోతే నీటి ఎద్దడి ఉన్నట్లే లెక్క. పంటకు అవసరం లేకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణవాయువు దక్కన్నప్పుడు నీరు పలచగానూ, మొన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యేవరకు 2 సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్టదశ నుంచి గింజ గట్టిపడేవరకు 5 సెంటీమీటర్ల నీరు ఉండాలి. ఈనిక, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిల్లోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు వహించాలి. కోతకు పది రోజుల ముందు నీటిని నెమ్మదిగా తగ్గించాలి.

అప్రమత్తత అవసరం



వర్షకాలంలో రైతులు అప్రమత్తంగా ఉంటే దిగుబడి సాధించవచ్చు. నీరు ఎక్కువైతే తెగులు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పిలకలు పెట్టే సామర్థ్యం తగ్గుతుంది. నీరు ఎక్కువగా ఉంటే చెను పెరగదు. నీరు తక్కువగా ఉండే ప్రదేశంలోని ఆరుతడి పంటలను సాగు చేయడం మంచిది. పంట పొలాల్లో సాగునీరు కావాల్సినంత ఉండే విధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

– ఉమామహేశ్వరీ, వ్యవసాయాధికారి అనంతగిరి

వ్యసనాలకు దూరంగా ఉండాలి



జి.మాడుగులలోని అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమేష్



దేవీపట్నంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగార్జున

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఐ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, మద్యం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సూచనలను పాటించాలన్నారు. ఏకగ్రాత ఆలోచన విధానం అంతా చదువుపై ఉంచాలన్నారు. అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు దేవీపట్నం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ నాగార్జున మాట్లాడుతూ యువత సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, గంజాయి తదితర మత్తుపదార్థాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఆశీల వసూలు



సంత ఆశీలు వేలంపాట దక్కించుకున్న చిట్టిబాబుకు పత్రాన్ని అందజేస్తున్న ఈవోపీఆర్‌డీ నర్సింగరావు, సర్పంచ్ మాధవరావు

పెదబయలు: మండలంలోనీ సీతగుంట పంచాయతీ పరిధిలోని పెదబయలు వారపు సంత ఆశీలు వసూళ్లకు వేలంపాట శుక్రవారం జరిగింది. ఈవోపీఆర్‌డీ నర్సింగరావు, సర్పంచ్ పలాసి మాధవరావు ఆధ్వర్యంలో పంచాయతీ కారకార్యాలయంలో జరిగిన వేలంపాటలో రూ.2వేల ప్రవేశ రుసుము చెల్లించి, 12 మంది పాల్గొన్నారు. వేలంపాటు రూ.1లక్ష నుంచి ప్రారంభం కాగా అత్యధికంగా రూ.6.15లక్షలకు తొరంగుల గ్రామానికి చెందిన వంతాల చిట్టిబాబు టెండర్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ నర్సింగరావు, సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ ఆశీల వేలంపాట నిధులు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కొంత వాటా కేటాయింపుతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా సంత నిర్వహించాలని సూచించారు. సంత నిర్వహణ టెండర్ ఈనెల 22 నుంచి మార్చి 31, 2025 గడువు ఉన్నట్టు తెలిపారు. పెదబయలు వారపు సంత ఆశీలు వేలంపాట మునుపెన్నడూ లేని విధంగా రూ.6.15లక్షల రికార్డు స్థాయిలో ఈ ఏడాది సాగినట్టు పలువురు చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు, వైస్ సర్పంచ్ గంగాధరం, పంచాయతీ కార్యదర్శి కాశీబాబు, వార్డు సభ్యులు జీవన్‌కుమార్, వెంకటరావు పాల్గొన్నారు.